సాక్షి సంగారెడ్డి
గురువారం । 1 । మే । 2025



మేం మళ్లీ రాలేం
రెవెన్యూ పాలనను పునరుద్ధరించాలను కున్న సర్కార్ ఆశలను వీఆర్వో, వీఆర్‌ఏలు అడియాశలు చేసినట్లేనా? వివరాలు 12లో ▸



ఎండుగంజాయి పట్టివేత
అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని జహీరాబాద్ పరిధిలోని చిరాగ్‌పల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. వివరాలు 12లో ▸



పదిలో సర్కారీ బడుల సత్తా
పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రైవేటుగా దీటుగా ప్రభుత్వ పాఠశాలలు సత్తా చాటాయి. వివరాలు 13లో ▸

న్యూస్‌రీల్

దార్శనికుడు బసవేశ్వరుడు
ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


బసవేశ్వర జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి : బహుజన వర్గాలను రాజ్యాధికారానికి చేరువ చేసిన దార్శనికుడు బసవేశ్వరుడని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. బసవ జయంతిని పురస్కరించుకుని బుధవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని బైపాస్‌లోని బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ...కుల మతాలకతీతంగా మహిళలందరికీ సమానత్వం కావాలని కోరుకున్న మహనీయుడు బసవేశ్వరుడు అని అన్నారు. కష్టంలోనే సుఖం స్వర్గం ఉందని చెప్పిన మహనీయుడని ఆయన చూపిన మార్గం భావితరాలకు ఆదర్శనీయమని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నాయకులు శివరాజ్ పాటిల్, జిల్లా అధికారి జగదీశ్వర్, రామప్ప, చీల మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడి బోధనలు ఆదర్శనీయం: గూడెం


బసవేశ్వరుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విశ్వగురు మహాత్మ బసవేశ్వరుడి బోధనలు నేటి తరానికి ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. రామచంద్రాపురం పట్టణంలో బసవేశ్వరుడి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. రామచంద్రాపురం బీరంగూడ కమాన్ వద్ద బసవేశ్వరుని విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ బసవేశ్వరుని బోధనలు ప్రతీ ఒక్కరికి అందించాలన్న లక్ష్యంతో బీరంగూడ కమాన్ వద్ద సొంత నిధులు రూ.30 లక్షలతో బసవేశ్వరుని విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆయన అనుసరించిన మార్గాన్ని భావితరాలు ఆచరించాలని సూచించారు. అనంతరం కార్పొరేటర్ పుష్ప, నియోజకవర్గ బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ వి.ఆదర్శ్‌రెడ్డి బసవేశ్వరుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నెలలోనే పింఛను పత్రాలు
ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ అగర్వాల్


చందాదారులకు పీపీఓ పత్రాలను అందజేస్తున్న విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు టౌన్: పదవీ విరమణ పొందిన నెలలోనే పింఛను ప్రయోజనాలను మంజూరు చేసే ప్రక్రియను క్రమబద్ధీకరించి నెలలోనే వారికి సంబంధించిన పత్రాలు (పీపీఓ) అందేలా చర్యలు తీసుకున్నట్లు ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కమిషనర్ విశాల్ అగర్వాల్ పేర్కొన్నారు. ఏప్రిల్ నెలలో పదవీ విరమణ పొందిన 56మంది చందాదారులకు పీపీఓలను జారీ చేసి అందులో 26 మందికి కార్యాలయంలో బుధవారం అందజేశారు. అనంతరం లబ్ధిదారులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-2 ప్రశాంత్ ప్రియదర్శి, అకౌంట్ ఆఫీసర్ అబ్దుల్ అజీమ్ పాల్గొన్నారు.

సీఐటీయూ పోరాట ఫలితమే


యాదగిరి

సంగారెడ్డి : సీఐటీయూ పోరాట ఫలితమే అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు అని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెలంతా సెలవులు ఇస్తున్నామని ప్రభుత్వం తెలియజేయడం సంతోషకరమన్నారు. ఇతర సేవలు అందించటం కోసం అంగన్‌వాడీ ఉద్యోగులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీలకు వేసవి సెలవుల నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వానికి సీఐటీయూ సంగారెడ్డి జిల్లా కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సమరశీల పోరాటాలకు అంగన్‌వాడీ సిబ్బంది సిద్ధం కావాలని కోరారు.


పది ఫలితాల సందర్భంగా సంగారెడ్డిలో బాలికల కేరింతలు

అద్వితీయం
రాష్ట్రంలో 2వ స్థానంలో సంగారెడ్డి జిల్లా

- పది ఫలితాల్లో 99.09 ఉత్తీర్ణత శాతం
- ఉత్తీర్ణతలో బాలికల హవా


వర్షిక


గాయత్రి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పదోతరగతి ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. పరీక్షలు సమీపిస్తున్న సమయంలో ఒక్కో పాఠశాలను ఒక్కో జిల్లా అధికారికి దత్తత ఇవ్వడంతో ఈసారి మంచి ఫలితాలు వచ్చాయి. పదో తరగతి ఫలితాలలో 99.09 ఉత్తీర్ణత శాతంతో రాష్ట్రంలో 2వ స్థానంలో నిలిచింది. జిల్లావ్యాప్తంగా 22,374 మంది పరీక్షలు రాయగా 22,170 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 11,663 మంది బాలురకు గానూ 11,538 ఉత్తీర్ణత సాధించగా 125మంది బాలురు మాత్రమే ఫెయిల్ అయ్యారు. అదేవిధంగా 10,711 మంది బాలికలకుగానూ 10,632మంది ఉత్తీర్ణత సాధించగా 79మంది బాలికల ఫెయిల్ అయ్యారు. బాలుర ఉత్తీర్ణత శాతం 98.93 కాగా, బాలికల శాతం 99.26గా నమోదైంది. మునిపల్లి మండలం కంకోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వర్షిక 590 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా కంది మండలం చేర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వడ్ల గాయత్రి 588 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో అందోల్ గురుకుల పాఠశాల విద్యార్థి మంగళి రిషిత, కంది మండలం చెర్యాల ఉన్నత పాఠశాల విద్యార్థి దృషిక 586 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. వీరితో పాటు జిల్లాలో 13 మంది విద్యార్థులు 580కి పైగా మార్కులు సాధించారు.

368 ప్రభుత్వ పాఠశాలల్లో నూటికి నూరు
జిల్లావ్యాప్తంగా మొత్తం ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు 467 గానూ 368 పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించాయి. వీటిలో 158 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా 149 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలో 149 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 08 మోడల్ స్కూల్, 16 కస్తూర్బా పాఠశాలలు, రెండు గురుకుల పాఠశాల, ఎనిమిది బీసీ వెల్ఫేర్ పాఠశాలలు, 10 సోషల్ వెల్ఫేర్, ఆరు ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు, రెండు ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు, 9 మైనార్టీ గురుకుల పాఠశాలలున్నాయి.


తృతీయ స్థానంలో నిలిచిన చేర్యాల జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థి దృషికకు మిఠాయి తినిపిస్తున్న తండ్రి

ఎనిమిది మండలాల్లో వందశాతం ఫలితాలు
జిల్లాలో 28 మండలాలకు గానూ ఎనిమిది మండలాల్లో వంద శాతం ఫలితాలు వచ్చాయి. కొండాపూర్, సిర్గాపూర్, రాయికోడ్, కంగ్టి, వట్‌పల్లి, నిజాంపేట, మనూర్, కల్హేర్, మండలాల్లో వంద శాతం ఫలితాలు రాగా, 12 మండలాల్లో 99%, మూడు మండలాల్లో 98%, మూడు మండలాల్లో 97%, పటాన్‌చెరు 96.35%, సంగారెడ్డి 95.59% ఫలితాలతో చివరి స్థానంలో నిలిచాయి.

- 17 కస్తూర్బా పాఠశాలలకు గానూ 16 కస్తూర్బా పాఠశాలలో 100% ఫలితాలు వచ్చాయి. కేజీబీవీలలో 618 మంది పరీక్షలు రాయగా 617 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- 11 బీసీ వెల్ఫేర్ పాఠశాలలకు ఎనిమిది పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు వచ్చాయి. 701మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 698మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- 11 సోషల్ వెల్ఫేర్ పాఠశాలలకు గానూ 10 పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు వచ్చాయి. 850మంది విద్యార్థులకు గానూ 849మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- 12 మైనార్టీ పాఠశాలలకు గానూ తొమ్మిది పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు వచ్చాయి. 618 మంది విద్యార్థులకు గానూ 614మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- 10 ఆదర్శ పాఠశాలలకు గానూ ఎనిమిది పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు వచ్చాయి. వీటిలో 926 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 924 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- కొండాపూర్ మండలంలో 15 పాఠశాలలు ఉండగా 15 పాఠశాలల్లోనూ వంద శాతం ఫలితాలు వచ్చాయి. మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సంకీర్తన 579 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది.

దత్తత తీసుకోవడంతోనే..



పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రుల పర్యవేక్షణలో ఒక్కో పాఠశాలకు ఒక్కో జిల్లా అధికారిని కేటాయించాం. దీంతో సంబంధిత అధికారులు ఆయా గ్రామాలకు పర్యటనలకు వెళ్లినప్పుడు పాఠశాలలను సందర్శించడం, ఎప్పటికప్పుడు ప్రధానోపాధ్యాయులతో రివ్యూ మీటింగ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు క్రమం తప్పకుండా పరీక్షలను నిర్వహించడం వలనే ఇంతటి ఫలితాలు సాధ్యమయ్యాయి. రాష్ట్రంలో పదో తరగతి ఫలితాలలో జిల్లా రెండవ స్థానంలో నిలవడం చాలా గర్వంగా ఉంది.

– వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి

ఆర్టీసీ జేఏసీ చైర్మన్‌గా మల్లికార్జున్
జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఆర్టీసీ డిపో జేఏసీ చైర్మన్‌గా మల్లికార్జున్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో నూతన జేఏసీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కో చైర్మన్‌గా బస్వరాజ్, కోశాధికారిగా కిషన్ రాథోడ్, కన్వీనర్లుగా మానిక్(ఈయూ),హన్మయ్య(టీఎంయూ), నర్సింలు(టీజేఎంయూ), తుల్జయ్య (ఎస్‌డబ్ల్యుఎఫ్), జీవన్,వీరన్న,ఎస్.రెడ్డి, అనిల్‌కుమార్, సలహాదారులుగా నర్సింలు, సుందర్‌రాజ్, అక్బర్, లక్ష్మి, సౌజన్యలు ఎన్నికయ్యారు. ఈ నెల 7న నిర్వహించతలపెట్టిన సమ్మె జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతుందని చెప్పారు.

వేసవి శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే


వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలో రాజు డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి పిల్లల శిబిరాన్ని బుధవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు వేసవి సెలవులు వచ్చాయని, వారిని ఆడించడం, చదివించడం వంటి చేయించాలని చెప్పారు. వేసవి శిబిరాల వల్ల ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. కేవలం రూ.100 ఫీజుతో 13 ఏళ్లగా వేసవి శిబిరాలు నిర్వహిస్తున్న నిర్వాహకులు రాజు మాస్టర్‌ను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టునారాయణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం
టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి

సంగారెడ్డి : ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి అన్నారు. బుధవారం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో వాసవీ మాఇల్లు సేవా సంస్థ ఆధ్వర్యంలో రెండు చలివేంద్రాలను సంస్థ అధ్యక్షుడు తోపాజీ అనంత కిషన్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్‌ఎంఓ వీరాంజనేయులు, డైటీషియన్ బాలస్వామి, సిబ్బంది రాజు వాసవీ మా ఇల్లు సభ్యులు తోపాజి హరీష్, సంతోష్ గుప్తా, మధుమోహన్, శ్రీహరి, సుధాకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భూసమస్యలకు భూ భారతితో చెక్

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ఉమ్మడి జిన్నారం మండలాల్లో అవగాహన సదస్సు

జిన్నారం (పటాన్‌చెరు): నిర్ణీత గడువులోపు భూభారతి చట్టంతో సమస్యలు పరిష్కరించవచ్చని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలాల్లో బుధవారం ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ వ్యవస్థ మరింత బలోపేతం చేసేందుకు ప్రతీ గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను ప్రభుత్వం నియమించనుందన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాలకు పరిష్కారం లభించనుందని తెలిపారు. గ్రామాల్లోని రైతులకు భూసమస్యలపై ఉన్న అనుమానాలను నివృతి చేసేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ఆధార్ తరహాలోనే భూముల వివరాలతో కూడిన భూదార్ నంబర్‌ను కేటాయిస్తామని తెలిపారు. అర్హులైన రైతులు ఈ చట్టంపై అవగాహన పెంపొందించుకుని భూ సమస్యలు ఉంటే గ్రామసభలో అధికారులకు అర్జీలు అందించి పరిష్కరించుకోవాలని ధరణి పోర్టల్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీవో రవీందర్ రెడ్డి, తహసీల్దార్‌లు భిక్షపతి, పరమేశం, ఆర్‌ఐలు జయప్రకాశ్ నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, ఆత్మకమిటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

కొనుగోలు కేంద్రాలను పరిశీలన..
జిన్నారం మండల కేంద్రంలోని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గోనె సంచుల కొరత లేకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు. హమాలీల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు ధాన్యాన్ని ఎక్కువ రోజులు కేంద్రాల వద్ద నిల్వచేయవద్దని నిర్వాహకులకు సూచించారు.

రెండు వారాల దగ్గును నిర్లక్ష్యం చేయకండి
జిల్లా టీబీ నియంత్రణ అధికారి డా.అరుణ

నారాయణఖేడ్: రెండు వారాల పాటు దగ్గుతో బాధపడుతుంటే క్షయవ్యాధి లక్షణాలకు సంకేతాలని అందువల్ల అలాంటి వారు నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో తెమడ పరీక్ష చేయించుకోవాలని జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అరుణ సూచించారు. క్షయవ్యాధి నివారణకు సంబంధించిన సమాచారంతో కూడిన కరపత్రాలను బుధవారం ఖేడ్‌లో ఆమె స్థానిక ఎమ్మెల్యే డా.సంజీవరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...క్షయ వ్యాధి పట్ల భయపడాల్సిన అవసరంలేదన్నారు. సకాలంలో మందులు వాడితే నయమవుతుందని తెలిపారు.


సంజీవరెడ్డితో కలిసి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ అరుణ

ఉపాధిలో రాణిస్తున్నారు

- స్వయం ఉపాధిలో గ్రామీణ మహిళలు ముందంజ
- కొత్త సంఘాల ఏర్పాటుకు మహిళల ఆసక్తి
- జిల్లా టార్గెట్ రూ.927 కోట్లు రూ.911 కోట్లు మంజూరు

గ్రామ సమైఖ్య సంఘాలు	695
స్వయం సహాయక సంఘాలు	1,823
సంఘంలో సభ్యులు	1,98,154
రుణాల మంజూరు లక్ష్యం	రూ.927 కోట్లు
ఇప్పటి వరకు మంజూరైనవి	రూ.911 కోట్లు
స్త్రీ నిధి	రూ.108 కోట్లు

మునిపల్లి(అందోల్): గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా మహిళల స్వయం సహాయక బృందాలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తోంది. దీంతో మహిళలు కూడా స్వయం ఉపాధి కోసం వారే బాటలు వేసుకుంటున్నారు. చిరు వ్యాపారాల్లో ముందడుగు వేస్తున్నారు. ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగుతూ తమ కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. జిల్లాలోని ఆయా గ్రామాల్లో మహిళలు స్వయం సహాయక సంఘాలలో చేరి ప్రభుత్వం ఇస్తున్న రుణాలతో ఉపాధి పొందుతూ లాభాలు ఆర్జిస్తున్నారు.

కొత్త సభ్యుల చేరిక...సంఘాల ఏర్పాటు
పొదుపు చేస్తూ ఆర్థిక సాధికారత సాధించేందుకు మహిళలు కొత్తగా స్వయం సహాయక సంఘాలలో చేరుతున్నారు. కొత్తగా చేరిన వారు వారి సంఘం తరఫున బ్యాంకు ఖాతాలను తెరిపించి రుణాలు కూడా అందిస్తున్నారు. మండలంలోని స్వయం సహాయక సంఘాలలోని మహిళా సభ్యులకు ప్రభుత్వం ప్రతీ సంవత్సరం బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు మంజూరు చేస్తోంది.

లక్ష్యం రూ.927కోట్ల రుణాలు
ఆయా సంఘాల సభ్యులు బ్యాంకుల్లో చేసుకున్న పొదుపు, తీసుకుంటున్న రుణాలను అనుసరించి 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మొదటగా రూ.911 కోట్లను మంజూరు చేసింది. అందులోనే స్త్రీ నిధి ద్వారా రూ.110 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతోనే మొత్తం రూ.927 కోట్లను ప్రభుత్వం లక్ష్యంగా ఇచ్చినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. ఇక బ్యాంకులో రుణాలు పొందిన లబ్ధిదారులు తిరిగి బ్యాంకులలో జమ చేస్తున్నారు.


మునిపల్లిలో అవగాహన సదస్సుకు హాజరైన సంఘం మహిళలు, అధికారులు

ఎంతో ఉపయోగంగా ఉంది



డ్వాక్రా గ్రూపు సంఘంలో తీసుకున్న రుణంతో బుట్టలు, చాటలు అల్లుకుని వాటిపై వచ్చే డబ్బులతో కుటుంబం జీవనోపాధి పొందుతున్నాను. గ్రూపులలో చేరని వారంతా డ్వాక్రా గ్రూపులలో సభ్యత్వం తీసుకుని బ్యాంకు రుణాలతో కొంత వరకు ఉపాధి పొందడానికి అవకాశం ఉంది.

– మెదరి దుర్గారాణి

కొత్త సంఘాలు ఏర్పాటు..



కొత్తగా డ్వాక్రా గ్రూపు సంఘాలను ఏర్పాటు చేసి సంఘం సభ్యులకు రుణాలు మంజూరు చేస్తాం. రుణాలు పొందిన సభ్యులు వివిధ రకాల షాపులు, పని ముట్లు, కుట్టుమెషీన్లు, బట్టల వ్యాపారం ఇలా రక రకాల వ్యాపారాలు చేస్తూ తీసుకున్న రుణాలను తిరిగి బ్యాంకులలో జమ చేస్తున్నారు.

– జ్యోతి (డీఆర్‌డీఓ పీడీ)

ఐదు పీహెచ్‌సీలకు నిధులు

- రెండు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనులు ప్రారంభం
- మరో రెండింటికి టెండర్లు ఖరారు
- మంత్రి దామోదర చొరవతోనే..

సంగారెడ్డి : జిల్లాలో నూతనంగా ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నిధులు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా జిల్లాలోని అందోల్ మండలం నేరడిగుంట, రాయికోడు మండలం సంగీతం, ఝరాసంగం మండలం బర్దీపూర్, మునిపల్లి మండలం కంకోల్ గ్రామాల్లో రూ.2.45కోట్ల నిధులు మంజూరయ్యాయి. అలాగే నూతనంగా ఏర్పడ్డ చౌటకూరు మండలం సుల్తాన్పూర్ గ్రామంలో రూ.2.60కోట్ల నిధులు మంజూరు చేస్తూ తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఐదింటిలో బర్దీపూర్, కంకోల్, సింగీతంలలో టెండర్లు పూర్తయి పనులు కొనసాగుతున్నాయి. నేరేడుగుంటలో టెండర్ దశ పూర్తయింది. నూతనంగా ఏర్పడ్డ చౌటకూర్ మండలం సుల్తాన్పూర్‌లో ఈ రెండు మూడు రోజుల్లో టెండర్లు పిలువనున్నారు. జిల్లాలో నూతనంగా ఐదు ఆస్పత్రులు మంజూరు కావడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఉండటం ఆయన చొరవతోనే ఈ ఐదు ఆస్పత్రులు వచ్చాయని చెబుతున్నారు. ఇదేవిధంగా జిల్లాకు మరిన్ని పెద్ద ప్రాజెక్టులు తీసుకొచ్చి రాష్ట్రంలోనే జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహను జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సైతం జిల్లాకు జేఎన్టీయూ తేవడం ఆయన కృషే అంటున్నారు. రాబోయే రోజుల్లో జిల్లాతో పాటు అందోల్ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని నియోజకవర్గ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


కంకోల్‌లో నిర్మాణంలో ఉన్న పీహెచ్‌సీ

త్వరగా పూర్తయ్యేలా చర్యలు
జిల్లాలో మంజూరైన ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు త్వరితగతిన పూర్తయ్యే విధంగా ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఐదు ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటయితే ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుంది.

– గాయత్రీదేవి. జిల్లా వైద్యాధికారి

క్లుప్తంగా

తొలి ప్రయత్నంలోనే జడ్జిగా..

నంగునూరుకు చెందిన మల్యాల సాహితీ ప్రతిభ


మల్యాల సాహితీ

నంగునూరు(సిద్దిపేట): తెలంగాణ హైకోర్టు జడ్జి కోసం నిర్వహించిన వివిధ ప్రక్రియలో నంగునూరుకు చెందిన మల్యాల సాహితీ విజయం సాధించింది. సిద్దిపేట జిల్లా నంగునూరుకు చెందిన మల్యాల అన్నపూర్ణ, రాజు పెద్ద కూతురు మల్యాల సాహితీ బెంగళూర్‌లోని రేవా యూనివర్సిటీలో లా విద్య పూర్తి చేసింది. తెలంగాణ హైకోర్ట్ జడ్జి నోటిఫికేషన్ విడుదల చేయడంతో దరఖాస్తు చేసుకుంది. వివిధ దశల్లో జరిగిన ప్రక్రియలో విజయం సాధించడంతో తొలి ప్రయత్నంలోనే జడ్జిగా నియామకమైంది.

సాంస్కృతిక పోటీల్లో యువకుడి ప్రతిభ


లోకేశ్‌కు బహుమతి అందజేస్తున్న వెంకీ

కౌడిపల్లి(నర్సాపూర్): తెలంగాణ యువత ఆధ్వర్యంలో రిథమ్ డ్యాన్స్ అకాడమీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీల్లో కౌడిపల్లి యువకుడికి సోలో డ్యాన్స్‌లో ప్రథమ బహుమతి లభించింది. 26, 27 తేదీల్లో కరీంనగర్ జమ్మికుంటలో వివిధ విభాగాలలో రిథమ్ డ్యాన్స్ అకాడమీ పోటీలు నిర్వహించింది. ఇందులో కౌడిపల్లికి చెందిన సంధ్యగళ్ల లోకేశ్ సోలో డ్యాన్స్ సీనియర్ విభాగంలో పోటీల్లో పాల్గొనగా ప్రథమ బహుమతి సాధించాడు. దీంతో జబర్దస్త్ ఆర్టిస్ట్ వెంకీతోపాటు నిర్వాహకుల నుంచి బహుమతి అందుకున్నట్లు లోకేశ్ తెలిపాడు. లోకేశ్ ప్రస్తుతం ట్రిపుల్‌ఈ డిప్లొమా పూర్తిచేశారు.

ఉత్తమ సేవలకు ఆర్టీసీ ప్రగతి చక్రం పురస్కారాలు


పురస్కారం అందజేస్తున్న డీఎం హుస్సేన్

జహీరాబాద్: ఉత్తమ సేవలందిస్తున్న ఆర్టీసీ సిబ్బందికి ప్రగతి చక్రం పురస్కారాలు అందజేశారు. బుధవారం స్థానిక బస్‌డిపో ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ క్యాష్ అవార్డులతోపాటు ప్రశంసా పత్రాలను అందించి సత్కరించారు. ప్రథమ బహుమతి కింద రూ.800, ద్వితీయ బహుమతి కింద రూ.600, తృతీయ బహుమతి కింద రూ.400 అందజేశారు. ఉద్యోగ విరమణ పొందుతున్న మొగులప్ప, వెంకన్న, వహీద్, ప్రమీలలకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, గ్యారేజీ ఇన్‌చార్జి తిరుమలేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

బసవేశ్వరుడి ఆశయ సాధనకు కృషి చేయాలి

టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా రెడ్డి


నివాళులర్పిస్తున్న నిర్మలారెడ్డి, తదితరులు

సంగారెడ్డి జోన్: బసవేశ్వరుడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా రెడ్డి సూచించారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో బసవేశ్వర 892వ జయంతి వేడుకలు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్‌తో పాటు అధికారులు లింగాయత్ సభ్యులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్మలారెడ్డి మాట్లాడుతూ సమాజ సేవకు అహర్నిశలు పాటుపడిన మహనీయుడని గుర్తు చేశారు. వీరశైవ లింగాయత్ భవన్ నిర్మాణం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పద్మజ రాణి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, జిల్లా లింగాయత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారిపై కుక్కల దాడి


గాయాలతో చిన్నారి

అల్లాదుర్గం(మెదక్): మూడేళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలైన ఘటన అల్లాదుర్గంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం మేరకు.. అల్లాదుర్గానికి చెందిన మస్తాన్ భేరీషి కూతురు పాతీయ (3) ఇంటి ఎదుట ఆడుకుంటున్న తరుణంలో గుంపులుగా వచ్చిన కుక్కలు చిన్నారి పై దాడి చేశాయి. కుటుంబీకులు, కాలనీవాసులు వచ్చి కుక్కలను తరమివేశారు. అప్పటికే చిన్నారి తలపై, ఒంటిపై తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని జోగిపేట ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు.

మేం మళ్లీ రాలేం..

రెవెన్యూ శాఖపై ఆసక్తి చూపని పూర్వపు వీఆర్వో, వీఆర్‌ఏలు

- ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 3,386 మంది
- జీపీవోలుగా వెళ్లేందుకు 562 మంది దరఖాస్తు
- అర్హత సాధించింది 481 మంది
- పాత సర్వీసును పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్



సాక్షి, సిద్దిపేట: గ్రామాల్లో రెవెన్యూ అధికారుల పాలనను మళ్లీ తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గతంలో పని చేసిన వీఆర్వోలు, వీఆర్‌ఏల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. కానీ అనుకున్న స్థాయిలో దరఖాస్తులు రాలేదు. పూర్వపు వీఆర్వో, వీఆర్‌ఏలు తిరిగి మాతృశాఖలోని వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. పూర్వ వీఆర్వో, వీఆర్‌ఏల నుంచి గత నెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో, ఫిజికల్‌గా కలెక్టరేట్లలో దరఖాస్తులను స్వీకరించారు. పాత సర్వీసును పరిగణలోకి తీసుకోకపోవడం, జాబ్ ప్రమోషన్ చాట్‌ను ప్రకటించకపోవడంతో జీపీవోలుగా వచ్చేందుకు చాలా మంది ఆసక్తి చూపడం లేదు.

562 మంది దరఖాస్తు

ఉమ్మడి మెదక్ జిల్లాలో పూర్వపు వీఆర్వోలు, వీఆర్‌ఏలు 3,386 మంది విధులు నిర్వర్తించేవారు. గత ప్రభుత్వం వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టంను తీసుకొచ్చింది. అందుకోసం క్షేత్రస్థాయిలో రెవెన్యూ గ్రామానికి ఒకటి చొప్పున జీపీవో పోస్టును మంజూరు చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,365 రెవెన్యూ గ్రామాలున్నాయి. తిరిగి రెవెన్యూ శాఖలోకి వెళ్లేందుకు 562 మందే దరఖాస్తు చేశారు. వీఆర్‌ఏలు అయితే ఇంటర్ పాసై ఉండటంతోపాటు ఐదేళ్ల సర్వీస్/డిగ్రీ ఉంటే ఎలాంటి సర్వీస్ అవసరం లేదు. దరఖాస్తుల్లో పొందుపరిచిన అర్హతలను పరిశీలించగా 81 మందివి రిజక్ట్ కాగా 481 మంది పరీక్షకు అర్హత సాధించారు.

పాత సర్వీసు పరిగణించకపోవడంతో

వీఆర్వో, వీఆర్‌ఏగా చేసిన సర్వీసు, ప్రస్తుతం విధులు నిర్వరిస్తున్న జూనియర్ అసిస్టెంట్ సర్వీసులను పరిగణలోకి తీసుకోమని ప్రభుత్వం ప్రకటించింది. అలాగే జీపీవోలకు జాబ్ చార్ట్ ప్రకటించారు. కానీ ప్రమోషన్ చార్ట్ ప్రకటించలేదు. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలో మూడేళ్లుగా జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. త్వరలో ఆయా శాఖలలో ప్రమోషన్‌లు రానున్నాయి. ఈ నేపథ్యంలో జీపీవోలుగా పని చేసేందుకు తక్కువ సంఖ్యలో ముందుకు వచ్చారని తెలుస్తోంది.

481 దరఖాస్తుల వివరాలు:

జిల్లా	వీఆర్వోలు	వీఆర్‌ఏలు	మొత్తం
సిద్దిపేట	51	142	193
మెదక్	55	56	111
సంగారెడ్డి	96	81	177

సర్వీసు పరిగణలోకి తీసుకోవాలి

వీఆర్వో, వీఆర్‌ఏ పాత సర్వీసుతోపాటు ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న సర్వీసును పరిగణలోకి తీసుకుంటే చాలా మంది వచ్చే అవకాశం ఉండేది. అలాగే జీపీవోలకు సంబంధించి ప్రమోషన్ చార్ట్‌ను సైతం ప్రకటించాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాత సర్వీసును పరిగణలోకి తీసుకోవాలి.

– ఆకుల రవీందర్, అధ్యక్షుడు, పూర్వపు వీఆర్వోల సంఘం

సీసీఎల్‌ఏకు పంపించాం

పాత వీఆర్వోలు, వీఆర్‌ఏలు జీపీఏలుగా వచ్చేందుకు దరఖాస్తు చేసిన వాటిని పరిశీలించాం. సీసీఎల్‌ఏ తెలిపిన ప్రకారం అర్హతలు ఉన్న వారి పేర్లను సీసీఎల్‌ఏకు పంపించాం.

– అబ్దుల్ రహమాన్, ఏవో, కలెక్టరేట్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

జేసీబీ, బైక్ ఢీకొని యువకుడు


బాలక్రిష్ణ

తూప్రాన్: జేసీబీ, బైక్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని నర్సంపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి గ్రామానికి చెందిన బాలక్రిష్ణ(22) మేస్త్రీ పని చేస్తున్నాడు. ఈ క్రమంలోనే నర్సంపల్లి మీదుగా గజ్వేల్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న జేసీబీ ఢీకొని తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

మినీ వ్యాను బోల్తా పడి ఒకరు..


ఖలీల్‌బాషా(ఫైల్)

చేగుంట(తూప్రాన్): మినీ వ్యాను బోల్తాపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మాసాయిపేట మండలం బొమ్మారం గేటు సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. ఆదిలాబాద్ జిల్లా ముక్రా గ్రామానికి చెందిన ఖలీల్‌బాషా(38) మినీ వ్యాను డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామున బాలానగర్‌లో సరుకులు లోడ్ చేసుకొని భీంగల్‌కు వస్తున్నాడు. ఈక్రమంలో బొమ్మారం గేటు వద్ద వ్యాను అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వ్యాను నడుపుతున్న ఖలీల్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ట్రాక్టర్ ఢీకొని మరొకరు

ములుగు(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ములుగు మండలం కొత్తూరు గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. మండలంలోని కొక్కొండ గ్రామానికి చెందిన కుమ్మరి రాజు(40) పెయింటింగ్ పనిచేస్తుంటాడు. బుధవారం బైక్‌పై మేడ్చల్‌కు పెయింటింగ్ పనికి వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి ఇంటికొస్తున్నాడు. మార్గమధ్యలో కొత్తూరు బ్రిడ్జి వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుమ్మరి రాజు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలికపై అత్యాచారం కేసులో..

నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష


బానోత్ శ్రీను

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఓ నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ సంగారెడ్డి న్యాయస్థానం బుధవారం తీర్పు నిచ్చింది. కొల్లూరు పోలీసుల కథనం మేరకు.. 2023 సెప్టెంబర్‌లో ఝరాసంగం మండలం భోజ్యానాయక్ తండాకు చెందిన బానోత్ శ్రీను డాన్స్ అసిస్టెంట్ మాస్టర్‌గా పని చేస్తున్నాడు. తెల్లాపూర్‌లోని విల్లాస్‌లో పిల్లలకు డాన్స్ నేర్పించడానికి వచ్చి డాన్స్ గ్రూపులోని ఐదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన నాటి ఇన్‌స్పెక్టర్ సంజయ్, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ రవీందర్, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, సుభాష్, కోర్టు కానిస్టేబుల్ నర్సింహులు, ఏఎస్‌ఐ రవీందర్ రెడ్డి సరైన సాక్ష్యాధారాలను సేకరించి సంగారెడ్డి కోర్టు ముందు ఉంచారు. ఈ కేసును విచారించిన ఫస్ట్ అదనపు డిస్ట్రిక్ట్ సెషన్స్ న్యాయమూర్తి కే.జయంతి నిందితుడు భానోత్ శ్రీనుకు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.సూరరెడ్డి వాదించారు. నిందితుడికి శిక్ష పడేలా చూసిన పోలీస్ అధికారులను మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ రావు అభినందించారు.

ఏడుపాయల్లో నీట మునిగి వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో గుర్తు తెలియని ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. ఏఎస్‌ఐ గాలయ్య కథనం మేరకు.. దుర్గమ్మ ఆలయం ముందు ఉన్న మంజీరా పాయల వద్దకు సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు నీట మునిగాడు. గమనించిన స్థానికులు వెంటనే ఆలయ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి బయటికి తీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి ఒంటిపై బ్రౌన్ కలర్ నిక్కర్ మాత్రమే ఉందని, మద్యం మత్తులో స్నానానికి వెళ్లి నీట మునిగి ఉంటాడని అనుమానిస్తున్నారు. మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 87126 57920 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పశువుల దొంగలు అరెస్టు

వర్గల్(గజ్వేల్): వ్యవసాయ పొలం నుంచి గేదెలను అపహరించిన ముగ్గురు బుధవారం వర్గల్ మండలం మజీద్‌పల్లి చౌరస్తావద్ద బేగంపేట పోలీసులకు చిక్కారు. బేగంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి కథనం మేరకు.. వర్గల్ మండలం నెంటూరుకు చెందిన భీమగల్ల కిష్టయ్య పొలం వద్ద కట్టేసిన రెండు పాడిగేదెలను కొద్ది రోజుల కిందట గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. వాటి కోసం వెతికినప్పటికీ ఫలితం దక్కలేదు. నాలుగు రోజుల కిందట బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం తెల్లవారుజామున మజీద్‌పల్లి చౌరస్తా వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. టాటా ఏస్ వాహనంలో అనుమానాస్పదంగా కన్పించిన నెంటూరు గ్రామస్తుడు కొత్తోల్ల కిష్టయ్య(45), శివ్వంపేట మండలం నవాబ్‌పేటకు చెందిన పకీర్ శాదుల్లా(30), ఎమ్‌డీ ముస్తఫా బేగ్(27)లను అదుపులోకి తీసుకొని విచారించారు. నెంటూరులో రెండు గేదెలను అపహరించుకుపోయినట్లు ఒప్పుకున్నారు. వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామని, వాహనంతో పాటు, రూ.1,03,000 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

రూ.20 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- హైదరాబాద్ నుంచి కర్ణాటకకు తరలింపు
- పోలీసుల అదుపులో నిందితుడు


గంజాయి, నిందితుడిని చూపుతున్న పోలీసులు

జహీరాబాద్: అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. చిరాగ్‌పల్లి సమీపంలో గల సహారా దాబా వద్ద 65వ జాతీయ రహదారిపై సీసీఎస్ బృందంతో కలిసి మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. హైదరాబాద్ వైపు నుంచి కర్ణాటక వైపు అనుమానాస్పదంగా వస్తున్న టాటా ఇండిగో కారును తనిఖీ చేయగా డిక్కీలో గోధుమ రంగు కవర్ చుట్టి 40 ఎండు గంజాయి ప్యాకెట్లు లభించాయి. నిందితుడు, కారు డ్రైవర్ జహీరాబాద్ మండలంలోని గోవింద్‌పూర్ గ్రామానికి చెందిన జీ.తిరుమలేశ్‌గా గుర్తించారు. నిందితుడి దూరపు బంధువైన బీదర్‌కు చెందిన గుండప్ప చెప్పినట్లుగా రూ.50 వేలకు ఆశ పడి కారులో గంజాయిని బగ్దల్‌లో ఉన్న వినోద్‌కు ఇచ్చేందుకు వెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి సుమారు 80 కిలోల వరకు ఉంటుందని, రూ.20 లక్షలు విలువ చేస్తుందని ఎస్‌ఐ వివరించారు. కారుతోపాటు సెల్‌ఫోన్ సీజ్ చేసి నిందితుడిని కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

పేదింటి సరస్వతీ పుత్రులు

బుధవారం విడులైన పదవ తరగతి ఫలితాల్లో పేదింటి సరస్వతీ పుత్రులు మెరిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ.. ఇంట్లో కష్టాలు ఉన్నా ఎదుర్కొని అత్యుత్తమ మార్కులు సాధించారు.

హోంగార్డు కూతురు..


ఎస్. రాజేశ్వరీ

కౌడిపల్లి(నర్సాపూర్): పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని వెల్మకన్న ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.రాజేశ్వరీ 576 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. స్వగ్రామం కిష్టాపూర్ కాగా వెల్మకన్నలో అమ్మమ్మగారి ఇంటివద్ద ఉంటూ చదువుతుంది. తండ్రి ఫైర్ స్టేషన్‌లో హోంగార్డుగా, తల్లి గృహిణిగా ఉన్నారు. బాసర ట్రిబుల్‌ఐటీలో సీటు వస్తే ఇంజనీరింగ్ చేయనున్నట్లు తెలిపింది. ప్రభుత్వ పాఠశాలలో చదివి మండల టాపర్‌గా నిలవడంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

రైతు బిడ్డ మండల టాపర్


రాజేశ్వరీ

చిన్నశంకరంపేట(మెదక్): నిరుపేద రైతుబిడ్డ పదవ తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచింది. చిన్నశంకరంపేట మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన కాశబోయిన క్రిష్ణ, భాగ్య కూతురు రాజేశ్వరీ రోజు రెండు కిలోమీటర్లు కాలినడకన వచ్చి మడూర్ జెడ్పీపాఠశాలలో చదివింది. కష్టం ఎదురైనా చదువును ఇష్టంగా చేసుకొని పదవ తరగతి ఫలితాల్లో 570 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. తన కూతురిని ట్రిపుల్ ఐటీ చదివించాలనే కల ఉందని విద్యార్థి తండ్రి కృష్ణ తెలిపారు.

తండ్రి కార్పెంటర్.. కూతురు టాపర్


ప్రశాంతి

రామాయంపేట(మెదక్): ప్రగతి ధర్మారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కమ్మరి ప్రశాంతి పదవ తరగతిలో 600 గాను 560 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఆమె స్వగ్రామం చేగుంట మండలం కిష్టాపూర్ . తండ్రి కమ్మరి మహేందర్‌కు గ్రామంలో కార్పెంటర్‌గా పని చేస్తాడు. అతడి కష్టంతోనే ఆ కుటుంబం సాగుతుంది. మహేందర్ పెద్ద కుమారుడు ఇంటర్ పూర్తి చేయగా, కూతురు పదో తరగతి చదువుతుంది. తన తండ్రి కష్టం చూసి బాధ కలుగుతుందని, దీనితో తాను చదువుపై దృష్టి సారించి రాత్రింబవళ్లు కష్టపడి చదివి ర్యాంక్ సాధించినట్లు ప్రశాంతి తెలిపింది. తనకు డాక్టర్ కావాలని కోరిక ఉందని ఆమె పేర్కొంది.

కష్టాలు పక్కన పెట్టి.. లక్ష్యాన్ని గురి పెట్టి


శ్రీలేఖ

నారాయణఖేడ్: తండ్రి లేడన్న బాధ.. తల్లి కష్టపడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న కష్టం.. అయినా మొక్కవోని ధైర్యంతో ఆ చిన్నారి చదువుపై దృష్టి సారించింది. పదవ తరగతి ఫలితాల్లో ఖేడ్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న శ్రీలేఖ 581 మార్కులతో నారాయణఖేడ్ నియోజకవర్గంలో టాపర్‌గా నిలిచింది. సిర్గాపూర్ మండల కేంద్రానికి చెందిన అవుటి యాదవులు, మౌనిక ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. చిన్న కూతురే శ్రీలేఖ. యాదవులు కొన్నేళ్ల కిందట మరణించారు. కుటుంబ భారం, కష్టాలు పైన పడటంతో మౌనిక కండక్టర్‌గా విధుల్లో చేరారు. తమ పిల్లలకు కష్టాలు రాకూడదని చదివిస్తుంది. ఉపాధ్యాయురాలు కావాలనేదే తన లక్ష్యమని శ్రీలేఖ చెబుతుంది.

తండ్రి చనిపోయాడనే దుఃఖాన్ని దిగమింగుకొని


సిరి చందన

నంగునూర్(సిద్దిపేట): మండలంలోని నర్మెట ఉన్నత పాఠశాలలో 10 తరగతి చదువుతున్న గంధమల్ల సిరి చందన పరీక్షలు రాస్తున్న సమయంలో తండ్రి యాదగిరి అనారోగ్యంతో మృతి చెందాడు. ఇంగ్లిష్ పరీక్ష రాసి ఇంటికి రాగానే తండ్రి చనిపోయాడని తెలియడంతో మనో వేదనకు గురైంది. దుఃఖాన్ని దిగమింగుకొని పరీక్షలు రాసిన సిరి చందన 471 మార్కులు సాధించింది.

తండ్రి దినసరి కూలీ.. తల్లి బీడీలు చుడుతూ..


శ్వేత

చేగుంట(తూప్రాన్): చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే కొటారి శ్వేత పదో తరగతిలో 564 మార్కులు సాధించి మండల స్థాయిలో ఐదో స్థానంలో నిలిచింది. శ్వేత తండ్రి కుమార్ ఓ ప్రైవేటు పరిశ్రమలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. తల్లి జ్యోతి బీడీలు చుడుతూ కూతురిని చదివిస్తున్నారు. రోజూ ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న చేగుంట పాఠశాలకు వచ్చి చదువుకునేది.

మట్టిలో మాణిక్యం నందిని


నందినిని అభినందిస్తున్న ఎంఈఓ, కార్యాలయ సిబ్బంది

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని వరి గుంతం ఉన్నత పాఠశాలలో చదువుతున్న నందిని 554 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. నందిని కుటుంబంలో ముగ్గురు ఆడపిల్లలే. తండ్రి 2023లో అనారోగ్యంతో మృతి చెందడంతో ఆడపిల్లల భారం తల్లి దుర్గమ్మపై పడింది. నందిని రెండవ సోదరి ఇంటర్ చదివి కుటుంబ పోషణ భారం కావడంతో తల్లితో పాటు వేరే చోట కూలీ పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. నందిని నానమ్మతో కలిసి గ్రామంలోని ఉంటూ చదువుతుంది. తోబుట్టువులు ఇచ్చిన ప్రోత్సాహంతో పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి వారి నమ్మకాన్ని నిలబెట్టింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి సత్యనారాయణ రావు, సిబ్బంది విద్యార్థినిని అభినందించారు.

సెలవులు.. నైపుణ్యాల నెలవులు

విద్యార్థులకు పరీక్షలు ముగిశాయి. నిన్నటి వరకు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ప్రస్తుతం సమ్మర్ క్యాంపులపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా కొత్త విషయాలు నేర్చుకోవడానికి ముందుకొస్తున్నారు.

– బెజ్జంకి(సిద్దిపేట)

- సమ్మర్ క్యాంపునకు అపూర్వ స్పందన
- ఎంఈఓ మహతీ లక్ష్మీ ఆధ్వర్యంలో బెజ్జంకిలో నిర్వహణ
- స్పోకెన్ ఇంగ్లిష్, యోగా, డ్రాయింగ్, కరాటే వంటి వాటిపై శిక్షణ
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు


బెజ్జంకిలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులు

బెజ్జంకిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపునకు విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన లభిస్తుంది. ఏప్రిల్ 24 నుంచి 3 తేదీ వరకు ఎంఈఓ మహతీ లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో స్పోకెన్ ఇంగ్లిష్, యోగా, డ్రాయింగ్, కరాటే, కాలిగ్రాఫీ, ఎథిక్స్, అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు వేసవిలో బయట తిరగకుండా ఉండటమే కాకుండా విజ్ఞానాన్ని, సృజనాత్మకతని పెంపొందిస్తారని తల్లిండ్రులు సైతం ఆసక్తిని కనబరుస్తూ పిల్లలను పంపుతున్నారు.

180 మంది హాజరు

బెజ్జంకితోపాటు కల్లెపెల్లి, ముత్తన్నపేట, వీరాపూర్, పోతారం, రేగులపల్లె, దాచారం గ్రామాల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సుమారు 180 మంది హాజరవుతున్నారు. మరింత మంది ఎన్‌రోల్ చేసుకుంటారని కో ఆర్డినేటర్ వడ్లకొండ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు.


చిత్రలేఖనం నేర్పుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు మణిశంకర్

సృజనాత్మకత పెరుగుతోంది



సమ్మర్ క్యాంపులతో విద్యార్థుల్లో సృజనాత్మకత, మానవతా విలువలు పెంపొందుతాయి. విద్యార్థులు ఉత్సాహంగా క్యాంపులో పాల్గొంటున్నారు. ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం బాగుంది. 40 మంది వచ్చే క్యాంపునకు 180 మంది విద్యార్థులు హాజరు కావడం సంతోషంగా ఉంది.

– వడ్లకొండ శ్రీనివాస్, క్యాంపు కోఆర్డినేటర్

సమ్మర్ క్యాంపు బాగుంది



వేసవి సెలవుల్లో బయట తిరగకుండా ప్రభుత్వం సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేయడం బాగుంది. దీని వల్ల విద్యార్థులకు మరింత పరిజ్ఞానం పెరుగుతంది.

– బెజ్జంకి చందు, విద్యార్థిని తండ్రి

తల్లిదండ్రులు ప్రోత్సాహం



బెజ్జంకిలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపునకు పిల్లలు, తల్లిదండ్రుల నుంచి మంచి ఆదరణ లభిస్తుంది. రోజు వివిధ విభాగాల్లో నైపుణ్యం పొందిన ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్‌కు ఆదరణ బాగుంది.

– పట్నం రమేశ్, స్పోకెన్ ఇంగ్లిష్ బోధకుడు